సాక్షి
సంగారెడ్డి
ఆదివారం । 21 । ఏప్రిల్ । 2024



3వ రోజు 5 నామినేషన్లు

పార్లమెంటు ఎన్నికల ప్రక్రియలో భాగంగా జహీరాబాద్‌లో ఐదు నామినేషన్ల దాఖలయ్యాయి. వివరాలు 8లో ▸



దొంగల ముఠా అరెస్టు

తాళం వేసిన ఇళ్లే లక్ష్యంగా చోరీలకు పాల్పడుతున్న అంతర్ జిల్లా దొంగల ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలు 8లో ▸



పారిశుధ్యం.. అస్తవ్యస్తం

డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారడంతో మురుగునీరంతా రోడ్లపైపారి దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి

మంత్రి కొండా సురేఖ



ర్యాలీని ప్రారంభిస్తున్న మంత్రి కొండా సురేఖ

జిన్నారం(పటాన్‌చెరు): కాంగ్రెస్‌తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని, ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని మంత్రి కొండా సురేఖ అన్నారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి నీలం మధు నామినేషన్ వేసేందుకు శనివారం మెదక్ వెళ్తుండడంతో గుమ్మడిదలలోని టోల్‌గేట్ వద్ద నిర్వహించిన ర్యాలీని ఆమె జెండాఊపి ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో నీలం మధు, కాటా శ్రీనివాస్‌గౌడ్, వివిధ మండలాల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అంతర్‌రాష్ట్ర చెక్‌పోస్టులు తనిఖీ



అధికారులకు సూచనలిస్తున్న ఆర్డీఓ అశోక చక్రవర్తి

నారాయణఖేడ్: పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా అంతర్‌రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టులను ఆర్డీఓ అశోక చక్రవర్తి శనివారం తనిఖీ చేశారు. నాగల్‌గిద్ద మండలంలోని మోర్గి, కరస్‌గుత్తిలలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులను తనిఖీ చేసి, చెక్‌పోస్టుల గుండా వాహనాల రాకపోకలు, డబ్బు తరలింపుపై అధికారులను ఆరా తీశారు. పకడ్బంధీగా తనిఖీలు చేపట్టాలని సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ షబానాబీ, నాయబ్ తహసీల్దార్ శివకృష్ణ, పోలీసు, ఎక్సైజ్, వ్యవసాయశాఖల అధికారులు ఉన్నారు.

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు

నారాయణఖేడ్: స్థానిక సీతారామచంద్రస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రథోత్సవం, అవధూత్ మహారాజ్‌తో కీర్తన, కుస్తీపోటీలు నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలతోపాటు కర్ణాటక, మహారాష్ట్రకు చెందిన మల్లయోధులు కుస్తీపోటీల్లో పాల్గొన్నారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ముగింపు కార్యక్రమాలు ఉంటాయని ఆలయ అభివృద్ధి కమిటీ బాధ్యులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

అంగన్‌వాడీ కేంద్రానికి పాడైనగుడ్లు

కౌన్సిలర్ కవిత విటల్

నారాయణఖేడ్: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులు, గర్భిణులకు కుళ్లిపోయిన కోడిగుడ్లు సరఫరా చేయడంతో గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఖేడ్ మున్సిపాల్టీ పరిధిలోని చాంద్‌ఖాన్‌పల్లి కేంద్రానికి సరఫరా అయిన కోడిగుడ్లు కుళ్లిపోయి ఉన్నట్లు కౌన్సిలర్ కవిత విటల్ ఆవేదన వ్యక్తం చేశారు. వాటిని చిన్నారులు, బాలింతలు, గర్భిణులు తినలేకపోతున్నారని, అవి భుజిస్తే అనారోగ్యం పాలయ్యే ప్రమాదం ఉందని వాపోయారు. చిన్నారులు, గర్భిణుల ఆరోగ్యాలను దృష్టిలో ఉంచుకొని అంగన్‌వాడీ సూపర్‌వైజర్, సీడీపీవో విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

హోరాహోరీగా కుస్తీపోటీలు



కుస్తీ పోటీలో తలపడుతున్న మల్లయోధులు

కల్హేర్(నారాయణఖేడ్): దుర్గమ్మ జాతర నేపథ్యంలో నిజాంపేట మండలం రాంరెడ్డిపేటలో శనివారం నిర్వహించిన కుస్తీ పోటీలు హోరాహోరీగా సాగాయి. కర్ణాటక, మహారాష్ట్ర తదితర ప్రాంతాలకు చెందిన మల్లయోధులు తరలివచ్చారు. విజేతలకు నగదు బహుమతులు అందజేశారు. చివరి కుస్తీ పోటీలలో గెలిచిన విజేతకు 5తులాల వెండి కడియం బహూకరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మన్నె కృష్ణ, గ్రామ ప్రముఖులు జనార్దన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ఈశ్వర్, భూమేశ్ పాల్గొన్నారు.

ఉపాధి, పంటకు మద్దతు ధర

- చట్టం చేస్తాం: దామోదర
- 15 ఎంపీ సీట్లలో గెలిపించండి
- పదేళ్లలో కేసీఆర్ చేసింది శూన్యం: కొండా సురేఖ
- ఎన్నికల తర్వాత బీఆర్‌ఎస్ దుకాణం బంద్: పొంగులేటి





ర్యాలీలో పాల్గొన్న మంత్రులు దామోదర, కొండా సురేఖ, సీఎం రేవంత్‌రెడ్డి, పార్టీ అభ్యర్థి నీలం మధు, ఎమ్మెల్యే రోహిత్‌రావు, ర్యాలీకి హాజరైన ప్రజలు

సాక్షిప్రతినిధి సంగారెడ్డి/మెదక్‌జోన్: రాష్ట్రంలో పదేళ్ల దొరల పాలనకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెక్ పెట్టారని మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. శనివారం కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధుకు మద్దతుగా ఎన్నికల ప్రచారంలో భాగంగా మెదక్‌లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం రాందాస్ చౌరస్తాలో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రైతు పండించిన పంటకు మద్దతు ధర కోసం, జాతీయ ఉపాధి హామీ పనులకు చట్టం చేస్తామన్నారు. రాష్ట్రంలో 15 ఎంపీ సీట్లు గెలుచుకోవడం ఖాయమన్నారు. మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ, తాము అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల వ్యవధిలోనే ఆరు గ్యారంటీలలో ఐదింటిని అమలు చేశామన్నారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి అత్యంత అవినీతిపరుడని విమర్శించారు. మల్లన్నసాగర్ ముంపు బాధిత రైతులను నిండా ముంచిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. బీజేపీ అభ్యర్థి రఘునందన్ చెల్లని చెక్కు లాంటివాడని విమర్శించారు. నీలం మధును అత్యధిక మెజార్టీతో గెలిపించి లోక్‌సభకు పంపించాలని కోరారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణలో కేసీఆర్ పతనం అయినప్పటికీ తానే ఇంకా సీఎం అనుకుంటూ వెర్రి వాగుడు వాగుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. లోక్‌సభ ఎన్నికల అనంతరం కేసీఆర్ దుకాణం తెలంగాణలో బంద్ అవుతుంది, ఆయన త్వరలో బీజేపీలో చేరబోతున్నారని జోస్యం చెప్పారు. బీజేపీ తెలంగాణకు చేసిందేమీ లేదన్నారు. నీలం మధు మాట్లాడుతూ.. తనను అభ్యర్థిగా గెలిపిస్తే మెతుకుసీమను మరింత అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే రోహిత్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు మైనంపల్లి హన్మంతరావు, మదన్‌రెడ్డి, నాయకులు రాజిరెడ్డి, ఆంజనేయులుగౌడ్, మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, బొజ్జ పవన్, జీవన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కదంతొక్కిన కాంగ్రెస్ శ్రేణులు

కాంగ్రెస్ పార్టీ శ్రేణులు కదం తొక్కాయి. శనివారం మెదక్‌లో నిర్వహించిన భారీ ర్యాలీ.. రోడ్‌షోకు కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. మధ్యాహ్నం 1.15 గంటల ప్రాంతంలో హెలిక్యాప్టర్‌లో సీఎం రేవంత్‌రెడ్డి మెదక్ చేరుకున్నారు. అనంతరం పట్టణంలోని బోధన్ చౌరస్తా నుంచి రోడ్‌షో ప్రారంభమైంది. పార్టీ కార్యకర్తలకు, పట్టణ వాసులకు అభివాదం చేసుకుంటూ స్థానిక రాందాస్ చౌరస్తా వద్ద జరిగిన కార్నర్ మీటింగ్‌లో ఆయన ప్రసంగించారు. కేసీఆర్, మోదీలపై తనదైన శైలిలో విరుచుకుపడ్డారు. మెదక్ ఎంపీగా ప్రాతినిథ్యం వహించిన దివంగత ప్రధానమంత్రి ఇందిరా గాంధీకి జిల్లాతో ఉన్న అనుబంధాన్ని వివరించారు. స్థానిక అంశాలను ప్రస్తావించిన రేవంత్‌రెడ్డి.. ఎన్‌డీఎస్‌ఎల్ చక్కెర కర్మాగారం పునఃప్రారంభం అంశం ఊసే ఎత్తలేదు. ఈ కర్మాగారాన్ని ప్రారంభించాలని డిమాండ్ జిల్లాలో చాలా కాలంగా ఉంది. ఈ ఫ్యాక్టరీ తెరిపించే అంశాన్ని పరిశీలించేందుకు ఇటీవల మంత్రి శ్రీధర్‌బాబు నేతృత్వంలోని ఓ కమిటీని ఏర్పాటు చేశారు.

కార్యకర్తల్లో జోష్

రేవంత్‌రెడ్డి జిల్లా పర్యటన కాంగ్రెస్ కార్యకర్తల్లో జోష్ నింపింది. సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారిగా మెదక్ రావడంతో ఆ పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. మెదక్‌తో పాటు, నర్సాపూర్, పటాన్‌చెరు, ఆందోల్ నియోజకవర్గాల నుంచి పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీ శ్రేణులు తరలివచ్చారు.

సభ హైలైట్స్

- ఎంపీ అభ్యర్థికి మద్దతుగా ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చారు
- మెదక్‌లో రోడ్లన్నీ జనంతో నిండిపోయాయి
- మెదక్ రాందాస్ చౌరస్తాలో సీఎం రాక కోసం ప్రజలు ఎదురు చూశారు
- మంత్రి కొండా సురేఖ, ఎంపీ అభ్యర్థి నీలం మధు ర్యాలీ నిర్వహించారు
- మైనంపల్లి హన్మంతరావు కార్యకర్తలతో కలిసి బుల్లెట్‌పై సభా స్థలానికి చేరుకున్నారు
- సీఎం రేవంత్‌రెడ్డి మధ్యాహ్నం 1.05గంటలకు చేరుకున్నారు
- సీఎం వెంట మంత్రి పొంగులేని సుధాకర్‌రెడ్డి వచ్చారు
- సీఎంకు మంత్రులు కొండా సురేఖ, దామోదర్ రాజనర్సింహ, ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు హన్మంతరావు, మదన్‌రెడ్డి తదితరులు స్వాగతం పలికారు
- సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు ప్రచార రథంపై ధ్యాన్‌చంద్ చౌరస్తా నుంచి రాందాస్ చౌరస్తా వరకు రోడ్‌షో నిర్వహించారు
- అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు దామోదర్ రాజనర్సింహ, కొండా సురేఖ, జగ్గారెడ్డి తదితరులు ప్రసంగించారు
- సీఎం సాయంత్రం 3.06గంటలకు హెలిక్యాప్టర్‌లో హైదరాబాద్ తిరుగు పయనమయ్యారు.

– హవేళిఘణాపూర్



గిరిదాటిన వికాసం

గిరిజనం.. మారిన జీవనం

నాడు గ్రామాలకు దూరంగా ఉన్న గిరిజన తండాలు నేడు ప్రగతి బాటలో పయనిస్తున్నాయి. వారి జీవన విధానంలోనూ పెనుమార్పులు చోటు చేసుకున్నాయి. కాలానుగుణంగా పోటీపడుతూ వివిధ రంగాల్లో రాణిస్తున్నారు. చదువుతోనే ఉజ్వల భవిష్యత్ ఉందని గుర్తించి పోటీ పడి ప్రభుత్వ ఉద్యోగాలు సాధిస్తున్నారు. రాజకీయాల్లోనూ తమ వంతు పాత్ర పోషిస్తున్నారు. ప్రత్యేక పంచాయతీల ఏర్పాటుతో ప్రగతి బాటలు వేసుకుంటున్నారు. మారిన తండాలు, గిరిజనుల జీవన విధానంపై ఈ ఆదివారం 'సాక్షి' అందిస్తున్న ప్రత్యేక కథనం..

– బొడ్డు రవి, శివ్వంపేట(నర్సాపూర్)

- ప్రగతి వైపు పయనం
- సాధికారతకు సోపానం
- ప్రభుత్వ ఉద్యోగాల్లో రాణింపు
- ప్రత్యేక పంచాయతీలతో మార్పు



టిక్యా తండాలో వెలిసిన భవనాలు

శివ్వంపేట మండలంలో తండాలు	38
పంచాయతీలు	11
మొత్తం జనాభా	8,051
ఓటర్లు	5,009



తీజ్ ఉత్సవాల్లో గిరిజన యువతులు

గత జీవనశైలి భిన్నం



గిరిజనులను ఈ ప్రాంతంలో లంబాడీలుగా, ఆదిలాబాద్‌లో ఆదివాసులుగా, ఆంధ్ర ప్రాంతంలో సుగాలిగా పిలుస్తుంటారు. గతంలో వీరు అటవీ సంపద, పశుపోషణ, వ్యవసాయంపై ఆధారపడేవారు. ఆరుతడి పంటలతో పాటు చెరకు సాగు చేసుకుంటూ జీవనం సాగించేవారు. కనీసం విద్యుత్ సౌకర్యం లేకుండా పూరి గుడిసెల్లో ఉంటూ కాలాన్ని వెళ్లదీశారు. గ్రామాలకు, పట్టణాలకు వెళ్లేందుకు సరైన రహదారులు లేకపోవడంతో ప్రజలతో సత్సంబంధాలు కొనసాగించలేకపోయారు.

ఆధ్యాత్మిక సందడి

గిరిజనుల్లో భక్తి భావాలు పెరిగాయి. తండాల్లో వీరి ఆరాధ్య దైవమైన సంత్ సేవాలాల్ మహారాజ్ ఆలయాల నిర్మాణాలు చేపట్టారు. దీక్షలు కొనసాగిస్తున్నారు. బోగ్ బండార్, దసరా ఉత్సవాలతో పాటు తీజ్ సంబరాలు నిర్వహిస్తూ పూర్వపు ఆచారాలను కొనసాగిస్తున్నారు. వీరి పేర్లలో సైతం మార్పులు చోటు చేసుకున్నాయి.

నాడు తండ్లాట.. నేడు ప్రగతి బాట

మారుతున్న కాలానుగుణంగా గిరిజనుల జీవన విధానంలో మార్పులు చోటుచేసుకుంటున్నాయి. గతంలో తండావాసులు వస్త్రాలంకరణలో ప్రత్యేకంగా కనిపించేవారు. ఇప్పటి యువత వాటిని ధరించడం లేదు. పట్టణ ప్రాంత ప్రజలతో మమేకమవుతున్నారు. తండాల నుంచి గ్రామాలకు బీటీ రోడ్డు ఏర్పాటుతో పాటు సీసీ రోడ్లు, అంతర్గత రహదారులు, మురికి కాలువల నిర్మాణం, రక్షిత వాటర్ ట్యాంకులు, ప్రాథమిక పాఠశాలలు ఏర్పాటయ్యాయి. గతంలో పూరి గుడిసెలు ఉండే తండాల్లో భవనాలు వెలిశాయి. శివ్వంపేట మండలంలోని పలు తండాలకు చెందిన 50 మందికిపైగా వివిధ ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి పలు చోట్ల స్థిరపడ్డారు. పోలీస్, సీఆర్‌పీఎఫ్, ఆర్మీ, బ్యాంకు, విద్యాశాఖలో ఉద్యోగాలు పొందారు. ప్రతి కుటుంబానికి ఎంతో కొంత సాగు భూములు ఉన్నాయి. ప్రస్తుతం వాటి ధరలు పెరగడంతో ఆర్థికంగా బలోపేతం అయ్యారు.

సండే స్పెషల్

గతంలో ఇబ్బందులు పడ్డాం



గతంలో తండాల్లో సరైన వసతులు లేక తీవ్ర ఇబ్బంది పడ్డాం. మారిన పరిస్థితులకు అనుగుణంగా కట్టుబొట్టులో మార్పులు జరిగాయి. మా తరం ధరించిన వస్త్రాలు ఇప్పటితరం వేసుకోవడం లేదు. కాలానుగుణంగా మమేకమై గ్రామీణ, పట్టణ ప్రాంతాల ప్రజలతో కలిసిపోయాం.

– లకావత్ మాటికీ, టిక్యా తండా

చదువుతోనే భవిష్యత్



సమాజంలో చదువుకు ఉన్న ప్రాధాన్యం మరేదానికి లేదు. ఉన్నత చదువులతో ఉజ్వల భవిష్యత్ ఆధారపడి ఉంది. గతంలో చదువుకు దూరంగా ఉన్న తండావాసులు నేడు చదువుకునేందుకు ముందుకు వస్తున్నారు.

– బుచ్యనాయక్, ఎంఈఓ, శివ్వంపేట

బార్డర్‌లో ఉద్యోగం చేస్తున్న



దేశానికి సేవ చేయాలన్న సంకల్పంతో 1994లో సీఆర్‌పీఎఫ్ ఉద్యోగం సాధించా. విశాఖపట్నం 198 బెటాలియన్‌లో కానిస్టేబుల్‌గా ఎంపికయ్యా. అక్కడి నుంచి ఇండియా బార్డర్‌లోని కశ్మీర్‌తో పాటు అస్సాం, పాండిచ్చేరి తదితర రాష్ట్రాల్లో విధులు నిర్వర్తించా. ప్రస్తుతం పాండిచ్చేరిలో ఏఎస్‌ఐగా విధులు నిర్వర్తిస్తున్నా.

– లచ్చునాయక్, బిక్యా తండా

రాజకీయంగా ఎదగాలి



గిరిజనులు రాజకీయంగా ఎదిగినప్పుడే హక్కులను పూర్తిస్థాయిలో సాధించుకునేందుకు అస్కారం ఉంటుంది. తండాలు పంచాయతీలుగా ఏర్పడడం వల్ల రాజకీయ చైతన్యం కొంతమేర పెరిగింది. అన్నిరంగాల్లో రాణించినప్పుడే అనుకున్న లక్ష్యం నెరవేరుతుంది.

– కమల, మాజీ జెడ్పీటీసీ, శివ్వంపేట

అమలుకాని హామీలతో ఆగం

మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి

సంగారెడ్డి టౌన్ /సంగారెడ్డి: రానున్న పార్లమెంట్ ఎన్నికలు తెలంగాణ వాదుకులకు, తెలంగాణ ద్రోహులకు మధ్య జరిగే పోరాటమని మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి అన్నారు. శనివారం జహీరాబాద్ అభ్యర్థి గాలి అనిల్ కుమార్ నామినేషన్ వేశారు. అనంతరం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ నాయకులు అమలు కాని హామీలు ఇచ్చి ప్రజలను ఆగం చేశారన్నారు. రేవంత్ అబద్ధాలకు ప్రజలే బుద్ధి చెప్తారని చెప్పారు. కేసీఆర్ స్వల్ప కాలంలోనే అనేక మంచి పథకాలు అమలు చేశారని, వాటిని ప్రజలకు అందించడంలో కాంగ్రెస్ విఫలమయిందని ఆరోపించారు. రుణమాఫీపై బట్టి విక్రమార్క ఒక మాట, సీఎం రేవంత్ రెడ్డి మరోమాట చెబుతున్నారని వాపోయారు. బీజేపీ పదేళ్లుగా తెలంగాణకు ఏం ఇచ్చిందో చెప్పాలని నిలదీశారు. నిధులు ఇవ్వకుండా కేంద్రం నిర్లక్ష్యం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కారుగుర్తుపై ఓటువేసి అనిల్ కుమార్ ను గెలిపించాలని కోరారు. ఎంపీ అభ్యర్థి గాలి అనిల్ కుమార్, జెడ్పీ చైర్ పర్సన్ మంజుశ్రీ పాల్గొన్నారు.

రూ.500కోట్ల అభివృద్ధికి నిధులు

రెండేళ్లలో జోగిపేట రూపురేఖలు మారుస్తా

మంత్రి దామోదర రాజనర్సింహ

జోగిపేట(అందోల్): రాష్ట్రంలో తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే అందోలు నియోజకవర్గ అభివృద్ధికి సుమారు రూ.500కోట్ల నిధులు మంజూరు చేయించానని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సి.దామోదర రాజనర్సింహ అన్నారు. శనివారం జోగిపేట మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీలో చేరిన సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రెండేళ్లలో నియోజకవర్గ రూపురేఖలు మారిపోతాయని చెప్పారు. గతంలో జేఎన్‌టీయూ, 3 పాలిటెక్నిక్ కళాశాలలు, సింగూరు జలాలు, పీజీ కళాశాలలు మంజూరు చేయించానని గుర్తుచేశారు. ఈసారి జేఎన్‌టీయూలో రూ.40 కోట్లతో సైన్స్ అండ్ టెక్నాలజీ సెంటర్‌ను మంజూరు చేయిస్తున్నానని, సింగూరు కాలువ లైనింగ్ పనులకు రూ.190 కోట్లు, నర్సింగ్ కాలేజీకి రూ.55కోట్లు, రూ.60కోట్లతో ఆసుపత్రి నిర్మాణం, రూ.89కోట్లతో అజ్జమర్రి వంతెన నిర్మాణం, రూ.20కోట్ల సంగుపేట నుంచి అన్నాసాగర్ వరకు ఫోర్ లైన్ రోడ్డు నిర్మాణం పనులకు నిధులు మంజూరైనట్లు తెలిపారు. అందోలు, సింగూరును పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తానని, రూ.100 కోట్లతో సింగూరు-బుదేరా రోడ్డు నిర్మాణం చేపడతామని, సంగుపేట-దాకూరు రోడ్డు మధ్యలో 10 ఫ్యాక్టరీలను ఏర్పాటు చేయించి ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ లోకసభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి సురేశ్ షెట్కార్‌ను గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జోగిపేట మున్సిపల్ చైర్మన్ జి.మల్లయ్య, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ జగన్మోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్ ప్రవీణ్‌కుమార్, కౌన్సిలర్లు సురేందర్‌గౌడ్, చిట్టిబాబు, డి.శివశంకర్, రంగ సురేశ్, నాగరాజు, ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మూడోసారి మోదీ ప్రధాని కావడం ఖాయం

బీజేపీ అభ్యర్థి రఘునందన్ రావు


ఎన్నికల ప్రచారంలో రఘునందన్ రావు

హత్నూర(సంగారెడ్డి): ప్రజలంతా నరేంద్ర మోదీని మూడోసారి ప్రధానిని చేయడం ఖాయమని బీజేపీ మెదక్ పార్లమెంట్ అభ్యర్థి రఘునందన్ రావు అన్నారు. శనివారం హత్నూర మండలం చందాపూర్, బోరుపట్ల, రెడ్డిఖానాపూర్, కాసాల, దౌల్తాబాద్ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పదేళ్ల మోదీ పాలనలో దేశం ఆర్థికంగా ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. ఈ సందర్భంగా దౌల్తాబాద్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ మండల నాయకుడు పాముల శ్రీనివాస్ బీజేపీలో చేరారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యుడు మురళీధర్ యాదవ్, మహేశ్, నాగప్రభు గౌడ్, మల్లేశం గౌడ్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా తనిఖీ చేయాలి

సిద్దిపేట సీపీ అనురాధ

సిద్దిపేటకమాన్: పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా జిల్లాలో విస్తృతంగా వాహనాల తనిఖీ చేపట్టాలని సిద్దిపేట సీపీ అనురాధ తెలిపారు. పోలీసు కమిషనర్ కార్యాలయంలో పెండింగ్ కేసులు, ఎన్నికల ఎన్‌ఫోర్స్‌మెంట్ వర్క్‌పై శనివారం సీపీ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జిల్లాలో గంజాయి, ఇతర మత్తు పదార్థాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలన్నారు. చెక్ పోస్టుల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ మల్లారెడ్డి, సిద్దిపేట ఏసీపీ మధు, త్రీ టౌన్ సీఐ విద్యాసాగర్, వన్ టౌన్ సీఐ లక్ష్మీబాబు, టూటౌన్ సీఐ ఉపేందర్, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సరైన పత్రాలు లేకుంటే సీజ్

ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి హరిశంకర్ గౌడ్


వాహనాలు తనిఖీ చేస్తున్న బృందం

పటాన్‌చెరు టౌన్: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల సంఘం నియమించిన ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు తనిఖీలు ముమ్మరంగా నిర్వహిస్తున్నాయి. అమీన్‌పూర్ మండల పరిధిలోని పటేల్‌గూడ రహదారిపై శనివారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్–2 అధికారి హరిశంకర్ గౌడ్ మాట్లాడుతూ.. రూ.50 వేలకు మించి నగదు తరలిస్తే తప్పనిసరిగా వాటికి సంబంధించిన పత్రాలు ఉండాలన్నారు. కార్యక్రమంలో ఫ్లయింగ్ స్క్వాడ్ అసిస్టెంట్ అధికారి సుభాష్, పోలీసులు పాల్గొన్నారు.

దొంగల ముఠా అరెస్టు

- తాళం వేసిన ఇళ్లే లక్ష్యంగా చోరీలు
- పోలీసుల అదుపులో నలుగురు, పరారీలో ఒకరు
- 12 పోలీసు స్టేషన్‌ల పరిధిలో 38 దొంగతనాల కేసులు
- వివరాలు వెల్లడించిన సీపీ అనురాధ


కేసు వివరాలను వెల్లడిస్తున్న సీపీ అనురాధ

సిద్దిపేటకమాన్: తాళం వేసిన ఇళ్లే లక్ష్యంగా చోరీలకు పాల్పడుతున్న అంతర్ జిల్లా దొంగల ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. ముఠా అరెస్టుకు సంబంధించిన వివరాలను పోలీసు కమిషనర్ కార్యాలయంలో శనివారం సీపీ అనురాధ వెల్లడించారు. సంగారెడ్డి జిల్లా బేబినాయక్ తండాకు చెందిన వ్యవసాయం చేసే జాదవ్ జైరామ్, రాథోడ్ నగేశ్, డ్రైవర్‌గా పనిచేసే జాదవ్ పుండలిక్, కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి మండలం వెల్లుట్ల తండాకు చెందిన రైతు కేతవత్ రాజు జల్సాలకు అలవాటు పడ్డారు. సులభంగా డబ్బులు సంపాదించాలనే ఆలోచనతో తాళం వేసిన ఇళ్లే లక్ష్యంగా రాత్రి సమయంలో చోరీలకు పాల్పడుతున్నారు. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటివరకు మూడు నెలల కాలంలో సిద్దిపేట జిల్లాలోని 9 పోలీసు స్టేషన్‌ల పరిధిలో 30 దొంగతనాలు, రాజన్న సిరిసిల్ల జిల్లా పరిధిలోని గంభీరావుపేట పోలీసు స్టేషన్ పరిధిలో 3, కోనారావు పీఎస్ పరిధిలో 2, తంగళ్లపల్లి పీఎస్ పరిధిలో 3తోపాటు మొత్తం 12 పోలీసు స్టేషన్‌ల పరిధిలో 38 దొంగతనాలకు పాల్పడ్డారు. బాధితుల ఫిర్యాదు మేరకు గజ్వేల్ ఏసీపీ పురుషోత్తంరెడ్డి, తొగుట సీఐ లతీఫ్, గజ్వేల్ సీఐ ముత్యంరాజు ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఈ క్రమంలోనే శనివారం తొగుట మండలం రాంపూర్ గ్రామ పరిధి వాగుగడ్డ చౌరస్తా వద్ద పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా దొంగల వద్ద ఐరెన్ రాడ్‌లు లభ్యమయ్యాయి. విచారణలో దొంగతనాలకు పాల్పడుతుంది తామే అని ఒప్పుకున్నారు. రాథోడ్ నగేశ్, జాదవ్ బలరామ్, జాదవ్ పుండలిక్, కేథవత్ రాజులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి 40.6 తులాల బంగారు, 55 తులాల వెండి ఆభరణాలు, 4 బైక్‌లు మొత్తం రూ.33,50,600 విలువ గల సొత్తును స్వాధీనం చేసుకుని నలుగురు నిందితులను జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఏ1గా ఉన్న నిందితుడు పరారీలో ఉన్నట్లు అతడిని కూడా త్వరలోనే అరెస్టు చేస్తామని సీపీ తెలిపారు. దొంగతనాల కేసులను ఛేదించిన ప్రత్యేక పోలీసు బృందాన్ని సీపీ అభినందించారు.

ఫారెస్టు బీట్ అధికారి ఇంట్లో చోరీ

మరో చోరీ కేసుకు సంబంధించి సీపీ అనురాధ కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం, బిసున్పూర్ జిల్లా, పిపర్వ గ్రామానికి చెందిన షరీఫ్ (49), అదే రాష్ట్రానికి చెంది ఖైరతాబాద్‌లో నివాసం ఉంటున్న తవాబ్ (37)తో కలిసి సులభంగా డబ్బులు సంపాదించాలనే ఆలోచనతో దొంగతనానికి పాల్పడ్డారు. ఇందులో భాగంగా గజ్వేల్ పట్టణంలోని ఫారెస్టు బీట్ అధికారి ములకలపల్లి వెంకన్న ఇంట్లో ఈ నెల 13వ తేదీన చోరీకి పాల్పడ్డారు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేపట్టారు. సీసీ ఫుటేజీ ఆధారంగా నిందితులను అదుపులోకి తీసుకొని విచారించగా నేరం ఒప్పుకున్నారు. వారి వద్ద నుంచి ఆరున్నర తులాల బంగారు ఆభరణాలు, రూ.27వేల నగదు స్వాధీనం చేసుకొని జ్యుడిడీషియల్ రిమాండ్‌కు తరలించినట్లు సీపీ తెలిపారు. నిందితులను పట్టుకోవడంలో కీలకపాత్ర వహించిన గజ్వేల్ సీఐ సైదా, అడిషనల్ ఇన్‌స్పెక్టర్ ముత్యంరాజు, క్రైమ్ పార్టీ సిబ్బంది వెంకటేష్, నవీన్, రవి, నరేందర్, సంతోష్‌లను సీపీ అభినందించారు. సమావేశంలో అడిషనల్ డీసీపీ మల్లారెడ్డి, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఏడేళ్ల బాలుడు కిడ్నాప్

- రూ.15 లక్షలు డిమాండ్ చేసిన కిడ్నాపర్
- మూడు గంటల్లో కేసును ఛేదించిన పోలీసులు
- సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ వద్ద ముగ్గురు నిందితుల అరెస్ట్

సిద్దిపేటకమాన్: ఏడేళ్ల బాలుడు కిడ్నాప్‌కు గురైన ఘటనలో పోలీసులు 3 గంటల్లోనే నిందితులను పట్టుకొని అరెస్ట్ చేశారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను పోలీసు కమిషనర్ కార్యాలయంలో సీపీ అనురాధ వెల్లడించారు. మర్కూక్ పోలీసు స్టేషన్ పరిధిలోని కర్కపట్ల గ్రామంలో ఉంటున్న బీహార్‌కు చెందిన తబ్రీజ్ ఆలంకు ముగ్గురు సంతానం. వీరిలో పెద్ద కుమారుడు తావిద్ ఆలం (7) కర్కపట్ల ప్రభుత్వ పాఠశాలలో రెండవ తరగతి చదువుతున్నాడు. బీహార్ రాష్ట్రానికి చెందిన అనూప్ చౌదరి (21) కొన్నేళ్ల కిందట తబ్రీజ్ దగ్గర పనిచేశాడు. ఈ క్రమంలో అనూప్‌కు తబ్రీజ్ కొంత డబ్బులు బాకీ ఉండడంతో అతడిని భయపెట్టాలనే ఉద్దేశ్యంతో పాఠశాల నుంచి ఇంటికొస్తున్న బాలుడికి చెప్పులు కొనిస్తానని చెప్పి కిడ్నాప్ చేశాడు. సాయంత్రం వరకు బాలుడు ఇంటికి రాకపోవడంతో తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఆ ప్రాంతంలో సీసీ ఫుటేజీలు పరిశీలించగా బాలుడిని ఓ వ్యక్తి తీసుకెళ్తున్నట్లు గుర్తించారు. బాలుడిని కిడ్నాప్ చేసిన అనూప్ మరో ఇద్దరు జార్ఖండ్‌కు చెందిన చందన్‌కుమార్ దాస్ (18), అస్సాం రాష్ట్రానికి చెందిన మేఘనాథ్ కర్మాకర్ (18) బస్సులో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు వెళ్లారు. అక్కడి నుంచి బాలుడి తండ్రికి ఫోన్ చేసి రూ.15 లక్షలు డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని బాలుడి తండ్రి పోలీసులకు తెలపడంతో గజ్వేల్ పోలీసులు, హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఈస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ నాగార్జున, సీసీఎస్ నాగరాజు, అనంతాచారి, కరుణాకర్‌రెడ్డి, రైల్వే పోలీసుల సాయంతో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ వద్ద ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. మూడు గంటల్లోనే కిడ్నాప్ కేసు ఛేదించి బాలుడిని రక్షించడంతో కుటుంబీకులు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. గజ్వేల్ రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి, మర్కూక్ ఎస్ఐ మధుకర్‌రెడ్డి, కానిస్టేబుళ్లు నర్సింహ, సాయి పాల్గొన్నారు.

గ్యారంటీలు అమలు చేసి ఓట్లడగండి

జనగామ ఎమ్మెల్యే పల్లా


మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లా

మద్దూరు(హుస్నాబాద్): ఆచరణ యోగ్యం కాని ఆరు గ్యారంటీలను అమలు చేసి ప్రజలను కాంగ్రెస్ ఓట్లు అడగాలని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి అన్నారు. శనివారం దూల్మిట్ట మండల కేంద్రంతో పాటు కూటిగల్, బెక్కల్, కొండాపూర్, తోర్నాల, లింగాపూర్ గ్రామాల్లో బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు రైతులకు రైతుబంధు, రైతుబీమా, కల్యాణలక్ష్మి, మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ, రైతులకు నిరంతరం నాణ్యమైన విద్యుత్ తదితర పథకాలను అమలు చేశామన్నారు. మల్లేశంను భారీ మోజార్టీతో గెలిపించాలన్నారు.

పంట రుణం చెల్లించాల్సిందే..

రైతుకు కోర్టు ద్వారా నోటీస్ పంపిన బ్యాంకర్లు


నోటీస్ చూపుతున్న రైతు మాణయ్య

వట్‌పల్లి(అందోల్): కాంగ్రెస్ ప్రభుత్వం ఆగస్టు వరకు పంట రుణాలను మాఫీ చేస్తుందని బ్యాంకర్లు రుణాల విషయంలో రైతులను ఇబ్బందులు పెట్టరాదని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల ప్రకటించిన విషయం తెలిసిందే. కానీ అవేవి తమకు పట్టనట్లు బ్యాంకర్లు రుణాల విషయంలో రైతులను ఇబ్బందులకు గురి చేస్తూనే ఉన్నారు. అందోలు మండల పరిధిలోని కన్‌సాన్‌పల్లి గ్రామానికి చెందిన దేవునూరి మాణయ్య అనే రైతు జోగిపేట ఎస్‌బీఐ బ్యాంకులో 2019లో రూ.లక్ష 65 వేలు పంట రుణంగా తీసుకున్నాడు. ప్రస్తుతం వడ్డీతో కలిపి రూ.2,48,770 అయ్యింది. బ్యాంకు అధికారులు రైతుకు ఫోన్‌చేసి అప్పు చెల్లించాలని అడుగడంతో పత్తి పంట మీద చెల్లిస్తానని చెప్పినా వినకుండా కోర్టు ద్వారా నోటీసు పంపించారు. శనివారం సదురు రైతు సాక్షిని సంప్రదించి బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.లక్ష రుణమాఫీ చేస్తానని ప్రకటించడంతో అప్పట్లో తీసుకున్న రుణాన్ని కట్టలేక పోయానని దీంతో ఆ అప్పు వడ్డీతో కలిపి రెండు లక్షలు దాటిందన్నాడు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం రూ.2 లక్షల వరకు రుణం మాఫీ చేస్తామని చెప్పడంతో సమయం దాటిన అప్పు చెల్లించలేదన్నాడు. ఈ విషయంపై జోగిపేట ఎస్‌బీఐ బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్ ప్రవీణ్‌కుమార్‌ను వివరణ కోరగా ప్రభుత్వంతో తమకు సంబంధం లేదని బ్యాంకు ఆదేశాలే ముఖ్యమని బదులిచ్చారు.

మాకు ఆదేశాలు రాలేదు:

శ్రావణి, ఎస్‌బీఐ బ్యాంకు మేనేజర్, జోగిపేట

రుణమాఫీ విషయంలో తమకు ప్రభుత్వం నుంచి ఎటువంటి ఆదేశాలు రాలేదు.సకాలంలో చెల్లించని వారిని మొండి బకాయి దారులుగా పరిగణించి కోర్టు ద్వారా నోటీసులు అందజేస్తున్నాం.

మూడో రోజు ఐదు నామినేషన్లు



కలెక్టర్ క్రాంతికి నామినేషన్ దాఖలు చేస్తున్న పోచారం శ్రీనివాస్‌రెడ్డి, గాలి అనిల్ కుమార్

సంగారెడ్డి టౌన్: పార్లమెంటు ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో భాగంగా జహీరాబాద్ లోక్ సభ నియోజకవర్గానికి సంబంధించి మూడో రోజైన శనివారం 5 నామినేషన్లు దాఖలయ్యాయని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ క్రాంతి వల్లూరు తెలిపారు. బీఆర్ఎస్ అభ్యర్థిగా అనిల్ కుమార్ గాలి తరపున ఒక సెట్ జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్ రావు, స్వతంత్ర అభ్యర్థిగా ప్రవీణ్, టీపీఎస్ పార్టీ అభ్యర్థి తరఫున కొత్త బలిజ బస్వారాజ్, స్వతంత్ర అభ్యర్థిగా రామారావు పాటిల్ ఒక్కొక్క సెట్ చొప్పున, స్వతంత్ర అభ్యర్థిగా బీ.మారుతీరావు రెండు సెట్ల చొప్పున నామినేషన్ పత్రాలను అందజేశారు. మొదటి, రెండు, మూడోరోజు కలుపుకొని ఇప్పటి వరకు 9 మంది నామినేషన్లు దాఖలు చేసినట్లు కలెక్టర్ క్రాంతి తెలిపారు.

ఎన్నికల రిటర్నింగ్ అధికారి క్రాంతి

జూన్ 1 వరకు ఎగ్జిట్ పోల్స్ నిషేధం

ఈనెల 19 నుంచి జూన్ 1 సాయంత్రం వరకు ఎగ్జిట్ పోల్స్‌ను జాతీయ ఎన్నికల సంఘం నిషేధించినట్లు ఎన్నికల అధికారి క్రాంతి తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా ఎగ్జిట్ పోల్స్ నిర్వహించినా, పత్రికల్లో ప్రచురించినా, ప్రసార మాధ్యమాల్లో ప్రసారం చేసినా, సోషల్ మీడియా లో పోస్టులు పెట్టినా చట్ట ప్రకారం చర్యలు తీసుకోనున్నట్లు హెచ్చరించారు. ప్రజాప్రాతినిధ్య చట్టం 1951, సెక్షన్ 126(అ) ప్రకారం శిక్షార్హులని తెలిపారు.

యువకుడి హత్య?

- సీసీ రోడ్డు నిర్మాణం పనులపై వివాదం
- పలువురికి గాయాలు
- సిర్గాపూర్ సింగార్‌బోగుడ తండాలో ఘటన
- కాంగ్రెస్ నాయకులే హత్య చేశారని ఆరోపణ


శ్రీనివాస్ నాయక్ మృతదేహం

కల్హేర్(నారాయణఖేడ్): కాంగ్రెస్, బీఆర్ఎస్ శ్రేణుల మధ్య పాతకక్షలు భగ్గుమన్నాయి. తండాలో సీసీ రోడ్డు నిర్మాణం పనులపై వివాదం కారణంగా యువకుడిపై దాడిచేసి హత్య చేశారు. ఈ ఘటన సిర్గాపూర్ మండలం సింగార్ బోగుడ తండాలో శనివారం జరిగింది. తండాలో సీసీ రోడ్డు నిర్మాణం పనులు జరుగుతుండగా అక్కడి నుంచి కంకర, ఇతర సామగ్రిని వేరేచోటకు తరలిస్తున్నారనే విషయంపై కాంగ్రెస్, బీఆర్ఎస్ శ్రేణుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. తండాకు చెందిన రాథోడ్ శ్రీనివాస్ నాయక్(24), అతని తండ్రి పండరి నాయక్, మరికొందరిపై కాంట్రాక్ట్ తీసుకున్న వ్యక్తులు దాడిచేశారు. తీవ్రంగా గాయపడడంతో శ్రీనివాస్ నాయక్‌ను సంగారెడ్డిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే మృతి చెందాడని వైద్యులు ధ్రువీకరించారు. పండరి నాయక్, మరికొందరు నారాయణఖేడ్ ఆస్పత్రిలో చేరారు. సీసీ రోడ్డు కాంట్రాక్ట్ తీసుకున్న కాంగ్రెస్ నాయకులే దాడిచేసి శ్రీనునాయక్‌ను హత్య చేశారని మృతుడి కుటుంబ సభ్యులు ఆరోపించారు. శ్రీనివాస్ నాయక్ మృతిపై విచారణ జరుపుతున్నామని సిర్గాపూర్ ఎస్ఐ మహిపాల్‌రెడ్డి తెలిపారు. కాంగ్రెస్ నాయకులు దాడి చేయడం వల్లే శ్రీనివాస్ నాయక్ మృతి చెందాడని మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి ఆరోపించారు. దోషులను అదుపులోకి తీసుకుని శిక్షించాలని డిమాండ్ చేశారు.

జైలుకెళ్లాలనే భయంతో.. యువకుడు ఆత్మహత్య


సాయిబాబ (ఫైల్)

రాయపోలు(దుబ్బాక): యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన రాయపోలు మండలం ముంగీసపల్లిలో చోటు చేసుకుంది. రాయపోలు ఎస్సై రఘుపతి తెలిపిన వివరాల మేరకు.. ముంగీసపల్లి గ్రామానికి చెందిన సూర్ణ పాపయ్య కుమారుడు సాయి బాబా (21) చదువు మానేసి తండ్రికి వ్యవసాయంలో చేదోడుగా ఉండేవాడు. గతేడాది అదే గ్రామానికి చెందిన ఓ మైనరు అమ్మాయిని ప్రేమించి ఇంటి నుంచి పారిపోయిన విషయంలో ఫోక్సో చట్టం కింద కేసు నమోదైంది. జైలుకు వెళ్లిన సాయిబాబా ఇటీవలె బెయిలుపై బయటకు వచ్చాడు. కాగా వర్గల్ మండలం గుంటిపల్లికి చెందిన మరో మైనరు అమ్మాయితో ప్రేమలో పడ్డాడు. ఈ విషయంలో అమ్మాయి కుటుంబసభ్యులతో గొడవ జరుగగా మరోసారి వర్గల్ మండలం గౌరారం పోలీస్‌స్టేషన్‌లో ఫోక్సో కింద కేసు నమోదైంది. మళ్లీ జైలుకు వెళ్లాల్సి వస్తోందని భయంతో ఈ నెల 19న తెల్లవారుజామున ఇంట్లో గడ్డి మందు తాగాడు. విషయాన్ని గమనించిన కుటుంబసభ్యులు గజ్వేల్ ప్రభుత్వాస్పత్రికి, మెరుగైన వైద్యం కోసం గాంధీ ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున మృతిచెందాడు.

మోసం చేసి భూమి మార్చుకున్నాడు


బాధితురాలు లచ్చమ్మ

నారాయణఖేడ్: కొత్త పాసు పుస్తకం ఇప్పిస్తానని చెప్పి భూమిని తన పేరుపైకి మార్చుకున్నాడని ఓ బాధితురాలు నిజాంపేట తహసీల్దార్ కార్యాలయం ఎదుట శనివారం ఆవేదన వ్యక్తం చేశారు. వివరాల్లోకి వెళ్తే.. నిజాంపేట గ్రామా నికి చెందిన కుమ్మరి లచ్చమ్మకు గ్రామ శివారులో 1.23 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఈ భూమి ఆమె పేరున ఉండడంతో సమీప బంధువు కుమ్మరి పోశెట్టి కొత్త పాసు పుస్తకం ఇప్పిస్తానని నమ్మించాడు. అధికారులతో కుమ్మక్కై ఆ భూమిని ఆయన పేరుపైకి మార్చుకున్నాడు. తాము ఈ భూమిని కొనుగోలు చేశామని, ఆర్వోఆర్‌లో సైతం తన పేరే ఉందని వాపోయింది. తనను మోసం చేసిన చర్యలు తీసుకొని న్యాయం చేయాలని నిరసన వ్యక్తం చేశారు. ఈ మేరకు తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించింది. తహసీల్దార్ రాజును వివరణ కోరగా గతేడాది డిసెంబర్ 5వ తేదీన అప్పటి డిప్యూటీ తహసీల్దార్ మహేష్ ఉన్న సమయంలో భూమి పేరు మార్పు జరిగిందని, తన పీరియడ్‌లో జరగలేదని అన్నారు. స్లాట్‌బుక్ చేసి సేల్‌డీడ్ చేశారని అన్నారు.

పోలీసులకు భయపడొద్దు..

- నోరు జారిన జగ్గారెడ్డి
- చెంపగిల్లిన సీఎం రేవంత్‌రెడ్డి


ప్రచారంలో మాట్లాడుతున్న జగ్గారెడ్డి

మెదక్‌జోన్: ఎన్ని ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నీలం మధు తరపున పట్టణంలోని రాందాస్ చౌరస్తాలో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి మాట్లాడుతూ.. నాలుగు దశాబ్దాల కిందట ఈ గడ్డపై ఎంపిగా గెలిచిన ఇందిరాగాంధీ ప్రధానమంత్రి అయ్యారని, ప్రస్తుతం చాలెంజ్‌గా తీసుకొని నీలం మధును ఎంపీగా గెలిపించుకోవాలంటూ ''పోలీసులకు అస్సలు భయపడొద్దని'' నోరుజారారు. పక్కనే ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి జగ్గారెడ్డి చెంపగిల్లి భుజంతట్టాడు. దీంతో నాలుక కార్చుకున్న జగ్గారెడ్డి సంగారెడ్డిని తాను చూసుకుంటానని, మెదక్‌ను ఎమ్మెల్యే రోహిత్‌రావు, సిద్దిపేటను మైనంపల్లి హన్మంతరావు, నర్సాపూర్‌ను మదన్‌రెడ్డి, రాజిరెడ్డి, పటాన్‌చెరును కాటా శ్రీనివాస్‌గౌడ్ చూసుకుంటారని తన ప్రసంగంను ముగించారు. పోలీసులకు భయపడవద్దు అనగానే సభలో ఉన్న జనమంతా నవ్వుకున్నారు.

అనుకూలించిన వాతావరణం

నీలం మధుకు మద్దతుగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రచారం నిర్వహించారు. ఉదయం 11 గంటలకు ప్రారంభం కావాల్సిన రోడ్ కార్నర్ మీటింగ్ 2 గంటలకు ప్రారంభమైంది. శనివారం ఉదయం చిరుజల్లులు పడి సాయంత్రం 5 గంటల వరకు ఆకాశం మేఘామృతమై చల్లటి వాతావరణం ఉంది. ఎన్నికల ప్రచారానికి వాతావరణం అనుకూలించడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

అప్రమత్తతతోనే అగ్ని ప్రమాదాల నివారణ


అగ్ని మాపక సాధనాలను చూపుతున్న ఫైర్ సిబ్బంది

సిద్దిపేటకమాన్: వేసవిలో అగ్ని ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశం ఎక్కువగా ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సిద్దిపేట అగ్నిమాపక శాఖ ఇన్‌చార్జి అధికారి నరేష్ సూచించారు. తెలంగాణ రాష్ట్ర విపత్తు స్పందన, అగ్నిమాపక సేవల శాఖ ఆధ్వర్యంలో సిద్దిపేట జిల్లాలో వారం రోజులుగా నిర్వహిస్తున్న అగ్నిమాపక వారోత్సవాలు శనివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వారం రోజులుగా అగ్నిప్రమాదాల నివారణ, ప్రమాద సమయంలో తీసుకునే జాగ్రత్తలపై ప్రజలకు అవగహన కల్పించామన్నారు. పట్టణంలోని ఆసుపత్రులు, పెట్రోల్ బంక్‌లు, షాపింగ్ మాల్స్, ఆర్టీసీ బస్టాండ్‌లు, జన సమూహం ఎక్కువగా ఉన్న ప్రాంతాలలో ప్రజలకు అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పించామన్నారు. బహుళ అంతస్తుల ప్రదేశాల్లో సిబ్బంది, ప్రజలు తప్పనిసరిగా అగ్నిమాపక సాధనాలను ఎలా ఉపయోగించాలో తెలుసుకోవాలన్నారు. వాటిని అందుబాటులో ఉంచుకోవాలన్నారు. రాత్రి సమయంలో షాపుల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయాలన్నారు. కార్యక్రమంలో లీడింగ్ ఫైర్‌మెన్ నరేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు హోటల్ దగ్ధం

ఒకరికి తీవ్ర గాయాలు


హోటల్‌లో వ్యాపిస్తున్న మంటలు

టేక్మాల్(మెదక్): ప్రమాదవశాత్తు హోటల్ దగ్ధమైన ఘటన టేక్మాల్ మండలంలోని బొడ్మట్‌పల్లిలో శనివారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. సంగారెడ్డి జిల్లా నిజాంపేటకు చెందిన మంగళి కన్నబాబు రెండేళ్లుగా సంగారెడ్డి–నాందేడ్ అకోలా రహదారి పై చాయ్‌దునియా పేరుతో హోటల్ నిర్వహిస్తున్నాడు. మధ్యాహ్న సమయంలో గ్యాస్ లీకేజీ అవడంతో దట్టమైన పొగతో మంటలు చెలరేగాయి. నిర్వాహకులు, స్థానికులు మంటలార్పే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. అందులోనే గ్యాస్ సిలిండర్ పేలడంతో తలారి నర్సింలుకు తీవ్ర గాయాలు అయ్యాయి. విషయం తెలుసుకున్న జోగిపేట ఫైర్ ఇంజన్ సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని మంటలార్పేశారు. రూ.48 వేలు నగదు, సామగ్రి, షెడ్డు కాలిపోవడంతో సుమారుగా రూ.6లక్షల నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయాడు. ఘటనా స్థలానికి డిప్యూటీ తహసీల్దార్ కిషోర్, ఆర్ఐ సాయిశ్రీకాంత్‌తోపాటు పోలీసులు చేరుకొని వివరాలు సేకరించి పంచనామ నిర్వహించారు.

విద్యుత్ తీగలు తగిలి..

నారాయణఖేడ్: ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు తగిలి పశుగ్రాసం, ట్రాక్టర్ ట్రాలీ దగ్ధమైంది. వివరాల్లోకి వెళ్తే.. ఖేడ్ మండలం ర్యాకల్ నుంచి చాప్టా(కె) మార్గంలో శనివారం పశుగ్రాసంతో ట్రాక్టర్ వెళ్తుంది. డ్రాగన్‌ఫ్రూట్ తోట సమీపంలో పైనున్న విద్యుత్ తీగలు తగిలి పశుగ్రాసం దగ్ధమైంది. ఖేడ్ అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించగా వచ్చి మంటలార్పారు ట్రాలీకి నష్టం వాటిల్లింది.

నట్టేట ముంచిన కాంగ్రెస్

- పదేళ్లు బీజేపీ చేసిందేమిలేదు
- మాజీ మంత్రి హరీశ్‌రావు

దుబ్బాక: నమ్మి ఓట్లేస్తే కాంగ్రెస్ సర్కార్ నట్టేట ముంచిందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. శనివారం దుబ్బాక మండలం పోతారంలో ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి స్వగృహంలో ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి, మెదక్ బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డితో కలిసి ఆయన నియోజకవర్గస్థాయి సమీక్ష నిర్వహించారు. అకాల వర్షాలతో ధాన్యం తడిసిపోయి రైతులు అష్టకష్టాలు పడుతుంటే కొనుగోలులో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. 10 ఏళ్ల బీజేపీ పాలనలో ప్రజలకు ఒరగబెట్టిందేమిలేదన్నారు. కేసీఆర్ లేకుంటే తెలంగాణ వచ్చేదా? కాళేశ్వరం ప్రాజెక్టు పూర్తి అయ్యేదా? ఈ బీడు భూములు సస్యశ్యామలం అయ్యేవా అని అన్నారు. కరువుకు నిలయమైన దుబ్బాక నియోజకవర్గం మల్లన్నసాగర్‌తో సస్యశ్యామలం అయిందన్నారు. రైతులకు రూ.500 బోనస్, 4 వేల పింఛన్ ఏమైందని కాంగ్రెస్‌ను ప్రశ్నించారు. అబద్ధాలు, మోసపు మాటలు మాట్లాడే రఘునందన్‌రావుకు మరోసారి దుబ్బాక ప్రజలు బుద్ధి చెప్పాలన్నారు. వెంకట్రామిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించేందుకు కార్యకర్తలు పట్టుదలతో పనిచేయాలని సూచించారు. ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డిలు మాట్లాడుతూ నెల రోజులు కార్యకర్తలు కష్టపడి పని చేస్తే 5 ఏళ్ల దాక కష్ట సుఖాల్లో అండగా ఉంటామన్నారు. సమావేశంలో నియోజకవర్గంలోని అన్ని మండలాల ముఖ్య నాయకులు తదితరులు ఉన్నారు.

పరస్పరం సహకరించుకోవాలి

సరిహద్దు పోలీసుల సమావేశం


సమావేశమైన రెండు రాష్ట్రాల పోలీసు అధికారులు

జహీరాబాద్: కర్ణాటకలోని జిల్లా కేంద్రమైన బీదర్‌లో తెలంగాణ–కర్ణాటక రాష్ట్రాలకు చెందిన సరిహద్దు పోలీసు స్టేషన్ల అధికారులు సమావేశమయ్యారు. శనివారం జరిగిన ఈ సమావేశంలో నేరాల నిరోధించడంలో రెండు ప్రాంతాలకు చెందిన పోలీసులు సరస్పరం సహకరించుకోవాలని, సంయుక్తంగా తగిన చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. నేరాలకు సంబంధించి నిందితులను పట్టుకునేందుకు రెండు రాష్ట్రాల పోలీసులు సమాచారం ఇచ్చి పుచ్చుకోవాలని తీర్మానించినట్లు పోలీసు అధికారులు పేర్కొన్నారు. పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి అక్రమంగా మద్యం, డబ్బు తరలిపోకుండా ఉండేందుకు నిరంతరం నిఘావేసి ఉంచాలని నిర్ణయించారు. సమావేశంలో జహీరాబాద్ డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి, నారాయణఖేడ్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి, జహీరాబాద్ టౌన్ సీఐ ఆర్.రవి, రూరల్ సీఐ నయిముద్దీన్, బీదర్ అదనపు ఎస్పీ, డీఎస్పీ, ఆయా పోలీసు స్టేషన్ల ఎస్ఐలు పాల్గొన్నారు.